క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ కోతలు ఉంటాయని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ చౌరస్తా, ప్రభుత్వ ఆస్పత్రి, గాంధీనగర్, బస్సు డిపో, బస్టాండ్, పాత గ్రామ పంచాయతీ, శిలార్‌పల్లి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యోగాతో ఏకాగ్రత

పెద్దకొత్తపల్లి: యోగాతో ఏకాగ్రత సాధ్యమని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ లత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాతో శారీరక ధృడత్వం, మానసిక ప్రశాంతత కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

వీరనారి ఐలమ్మ స్ఫూర్తితో పోరాడుతాం

తాడూరు: వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో భూ పోరాటాలు నిర్వహించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి భుక్తి కోసం పోరాడిన వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కుర్మయ్య, అజిత్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికావొద్దు

అమ్రాబాద్: విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని చదువుపై భయం వీడాలని మానసిక ఆరోగ్య నిపుణులు ఆంజనేయులు సూచించారు. గురువారం మండలంలోని జంగంరెడ్డిపల్లి గిరిజన ఆశ్రమబాలికల ఉన్నత పాఠశాలలో హైదరాబాద్‌లోని ఆశాజ్యోతి పునరావాసకేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థినులకు 'ఒత్తిడిని జయించడం ఎలా– ప్రతి సమస్యకు ఒక పరిష్కారం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ క్రైం వివరాలలో ఆత్మహత్యలు చేసుకుంటున్నవంటి వారిలో అధికంగా బాలికలే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒత్తిడికి దూరం అయ్యేందుకు నిత్యం యోగా, ధ్యానం , వ్యాయామం చేయాలని కోరారు. హెచ్‌ఎం ఉమాదేవి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

కేసులు నమోదుకు ఉత్తర్వులు జారీ?

లింగాల: నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండలంలోని ఆయా గ్రామాల్లో 2021లో జరిగిన ఉపాధి పనులలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో అప్పట్లో పని చేసిన సిబ్బందిపై కేసులు నమోదు, అరెస్టుకు ఆదేశాలు జారీ అయినట్లు గురువారం విశ్వసనీయంగా తెలిసింది. సామాజిక తనఖీలలో దాదాపుగా రూ. 3 కోట్ల మేరకు అక్రమాలు జరిగినట్లు బహిర్గతం కాగా, నివేదిక ఆధారంగా అప్పట్లో పని చేసిన సీనియర్ మేటీలతో సహ టీఏలు ఇతర సిబ్బందిపై కేసులు నమోదు అయినట్లు సమాచారం. మొత్తం 8 మందిపై కేసులు నమోదు కాగా ఉన్నతాధికారుల నుంచి పోలీసులకు సమాచారం అందినట్లు తెలిసింది. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

కణతి పిల్లను రక్షించిన సిబ్బంది



మన్ననూర్: తల్లి నుంచి తప్పిపోయిన కణతి పిల్లను అటవీశాఖ సిబ్బంది గుర్తించి కాపాడారు. అధికారుల వివరాల ప్రకారం దోమలపెంట రేంజ్ పరిధిలోని అటవీ సరిహద్దు ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం విధులు నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బందికి కణతి(దుప్పి) పిల్ల ఒకటి అనారోగ్యంతో బాధపడుతూ కనిపించింది. ఎంతకి కణతి తల్లి రాకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అమ్రాబాద్ పశు వైద్య ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించి మన్ననూర్‌లోని వనమాలికా ప్రాంగణంలో కణతి పిల్లను ఉంచారు. ఆరోగ్య పరిస్థితిని బట్టి నల్లమల అభయారణ్యంలో వదిలేస్తామని సంబంధిత అటవీశాఖ అధికారులు తెలిపారు.

ఘనంగా పోషణ మాసోత్సవాలు



లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ దమయంతి పిల్లలు, బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గ్రుండ్లు ప్రదర్శనగా ఉంచారు. సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, గిరిజ, ఏఎన్‌ఎం మంగ్లీబాయి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



సిర్సవాడ వద్ద రోడ్డు గుంతలపై నిలిచిన వర్షం నీరు



యత్మతాపూర్‌లో బీటీ రోడ్డుపై తెలిన కంకర

అధ్వానంగా రోడ్లు

తాడూరు: ఇటీవల కురిసిన వర్షాలకు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలకు వెళ్లే లింకు రోడ్లు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలు గ్రామాల ప్రజలు వాపోయారు. మండలంలోని దుందుబీ నది సిర్సవాడ దగ్గర వెంటనే రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని కోరారు. యత్మతాపూర్ వెళ్లే బీటీ రోడ్డు కంకర తేలడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కొల్లాపూర్ రూరల్: పట్టణ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల రోడ్డు బురదమయంగా మారింది. నడిచేందుకు కూడా వీలు లేకుండా పోయింది. ప్రతి రోజు కళాశాలకు వెళ్లే ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.



కొల్లాపూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలకు వెళ్లే రోడ్డు ఇలా..

భక్తిశ్రద్ధలతో వినాయక పూజలు



కొల్లాపూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

కొల్లాపూర్: పట్టణంలో గణేష్ ఉత్సవాలు ఆరోరోజు గురువారం భక్తశ్రద్ధలతో కొనసాగాయి. పలు వినాయక విగ్రహాల మండపాల వద్ద అన్నదానం చేశారు. కౌన్సిలర్ రహీంపాషా, కాంగ్రెస్ నాయకులు మేకల నాగరాజులు స్వామివారిని దర్శించుకున్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని తిలక్‌నగర్ కాలనీలో భక్తులు గణనాథుడికి 21 రకాల నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.



పెంట్లవెల్లి తిలక్‌నగర్ కాలనీలో..

వంగూరు: మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని నిమజ్జనం చేశారు. అంతకుముందు శోభాయాత్ర కనులపండువగా కొనసాగింది. యువకులు నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో లియో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని వినూత్న పద్ధతిలో గరుడ వాహనం క్రేను ద్వార గణనాథుడిని ఊరేగించారు. యువకులు, చిన్నారులు నృత్యాలు చేస్తూ గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. సీతారామాంజనేయ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన మట్టి గణనాథులను ఊరేగింపు నిర్వహించి స్వామివారిని గోపినేని చెరువులో నిమజ్జనం చేశారు. కోలాటాలు, చెక్క భజనలు ఆకట్టుకున్నాయి.



పెద్దకొత్తపల్లిలో గరుడ వాహనంపై క్రేన్ ద్వారా గణనాథుడు ఊరేగిస్తున్న భక్తులు

లింగాల: మండలంలోని అవుసలికుంటలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు. డప్పు చప్పుళ్ల, యువకుల నృత్యాల చేస్తూ సందడి చేశారు. అనంతరం గ్రామం చెరువులో నిమజ్జనం చేశారు. అంతకు ముందు మండపం వద్ద ఉట్లు కొట్టారు.

కట్టుదిట్టమైన చర్యలు

పెంట్లవెల్లి: గణేశ్ నిమజ్జనోత్సవాలకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటునట్లు సీఐ మహేశ్ పేర్కొన్నారు. జటప్రోల్, మంచాలకట్ట గ్రామాల్లో నిమజ్జనం నిర్వహించే ప్రాంతాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్, ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి, అరవింద్, ఆర్ఐ శివన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా

సాక్షి ఎఫెక్ట్..

వెల్దండ: 'చెర్కూర్‌లో తాగునీటి ఇబ్బందులు' శీర్షికతో గురువారం సాక్షిలో వార్త ప్రచురితం అయ్యింది. ఈ మేరకు కార్యదర్శి బాల్‌రాజ్, మిషన్ భగీరథ సిబ్బంది రామకృష్ణలు స్పందించి గ్రామంలో ఇంటింటికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. గ్రామంలో బోరు మోటార్‌కు మరమ్మతు చేయించారు. గ్రామంలో రెండు వాటర్ ట్యాంక్‌లను నీటితో నింపి ఆయా కాలనీలకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న పంచాయతీ సిబ్బంది

భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామం

చారకొండ: మండల కేంద్రంలో వేంకటేశ్వర దేవాలయంలో గురువారం ఆర్యవైశ్య మహిళలు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటి లలితా సహస్రనామం పఠనం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. మహిళలు అధికసంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో మహిళలు విజయలక్ష్మి, తోటసంతు, అనిత, దివ్య, పావని, మహేశ్వరి, వజన, గీతా, శివలీల, స్వాతి, హరిత తదితరులు ఉన్నారు.



చారకొండలో పాల్గొన్న మహిళలు

తహసీల్దార్ల బదిలీలు

నాగర్‌కర్నూల్: జిల్లాలో 22 మంది తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం రాత్రి కలెక్టర్ బదావత్ సంతోష్ ఉత్తర్వులు జారీ చేశారు.

తహసీల్దార్	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
శోభ	వెయిటింగ్ లిస్ట్	సూపరింటెండెంట్, కలెక్టరేట్
సురేష్	వెయిటింగ్ లిస్ట్	పదర
జయంతి	వెయిటింగ్ లిస్ట్	పెంట్లవెల్లి
విజయసింహ	వెయిటింగ్ లిస్ట్	ఆర్డీఓ కార్యాలయ ఏఓ, అచ్చంపేట
భరత్‌కుమార్	వెయిటింగ్ లిస్ట్	ఆర్డీఓ ఏఓ, కొల్లాపూర్
ఎం.రామకృష్ణ	వెయిటింగ్ లిస్ట్	తిమ్మాజిపేట
జాకీర్ అలీ	సూపరింటెండెంట్ నాగర్‌కర్నూల్ కలెక్టరేట్	తెలకపల్లి
కె.తబితారాణి	డీఏఓ, ఆర్డీఓ,	అచ్చంపేట నాగర్‌కర్నూల్
కిరణ్మయి	వంగూరు	తాడూరు
కార్తీక్‌కుమార్	సూపరింటెండెంట్ నాగర్‌కర్నూల్, కలెరేట్	వెల్దండ
రాంకోటి	పదర	ఊర్కొండ
సునీత	ఉప్పునుంతల	చారకొండ
మరళీమోహన్	అచ్చంపేట	వంగూరు
శైలేంద్రకుమార్	బల్మూరు	అచ్చంపేట
జి.శ్రీకాంత్	సూపరింటెండెంట్ నాగర్‌కర్నూల్ కలెక్టరేట్	బల్మూరు
ఏ పాండు	తెలకపల్లి	లింగాల
చెన్నకిష్టన్న	ఊర్కొండ	అమ్రాబాద్
కేసీ ప్రమీల	చారకొండ	ఉప్పునుంతల
జేకే మోహన్	తిమ్మాజిపేట	పెద్దకొత్తపల్లి
జి.చంద్రశేఖర్	నాగర్‌కర్నూల్	సూపరింటెండెంట్ నాగర్‌కర్నూల్ కలెక్టరేట్
రవికుమార్	వెల్దండ	సూపరింటెండెంట్ నాగర్‌కర్నూల్ కలెక్టరేట్
యూసుఫ్ అలీ	పెద్దకొత్తపల్లి	సూపరింటెండెంట్ నాగర్‌కర్నూల్ కలెక్టరేట్

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని తూడుకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యం గురువారం తెలిపారు. ఈ నెల 11వ తేదీన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కర్ని గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ 14 విభాగంలో బాలబాలికలు ప్రతిభ చాటారు. పాఠశాలలో 7వ తరగతి పల్లవి, 6వ తరగతి దాసరి నరహరి, 8వ తరగతి కార్తీక్‌లు 14 సంవత్సరాల సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 13, 14, 15 తేదీలలో మౌలాలీలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని మాడల్ స్కూల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు కర్ణాకర్‌రెడ్డి, కృష్ణమోహన్, సత్య, విమల, అరుణ, ఫిజికల్ డైరెక్టర్ సామ రమేష్‌లు అభినందించారు.

కల్వకుర్తి టౌన్: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు కల్వకుర్తి జేపీనగర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీధర్ రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 14,15 తేదీలలో హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే పోటీలలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం

కల్వకుర్తిరూరల్: దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయం ట్రస్టు చైర్మన్ జూలూరు రమేష్ బాబు కోరారు. గురువారం పట్టణంలో దసరా ఉత్సవాల నిర్వహణ కోసం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా జంపా శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రమేష్ బాబు మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు శివజగదీశ్వర్, కార్యదర్శి శ్రీధర్, శ్రీనివాసులు, శేఖర్, ప్రసాద్, మోహన్ బాబు, రవి, శ్రీనివాసులు, ప్రవీణ్, కృష్ణయ్య, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్ బాబు

మహిళ మృతిపై కేసు నమోదు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చెంచుగూడెంకు చెందిన మహిళ మెరుపల లక్ష్మి(35) భర్త శంకర్‌లు మంగళవారం రాత్రి అడవిలోకి కట్టెలు కొట్టేందుకు వెళ్లారు. అదేరోజు భార్యాభర్తల గొడవ జరిగింది. భర్త నిద్రిస్తున్న సమయంతో భార్య లక్ష్మి మనస్తాపంతో పక్కనే ఉన్న నీటి కుంటలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం మహిళ మృతిపై భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ హృషికేష్ తెలిపారు. ఇదిలా ఉండగా మృతురాలు తల్లిదండ్రులు తన కూతురును అల్లుడే చంపాడని అనుమానం వ్యక్తం చేశారు.

దాడి చేసిన వారిపై ..

వెల్దండ: మండలంలోని నగారగడ్డతండాలో గురువారం రాత్లవత్ గోపాల్, భార్య చౌలిపై అదే తండాకు చెందిన రాత్లవత్ లోకిలాల్, భార్య రాజేశ్వరిలు దాడి చేశారు. భూమికి సంబంధించిన విషయంతో పెద్దల సమక్షంలో మాట్లాడుతుండగా మాటమాట పెరిగింది. దీంతో లోకిలాల్ దంపతులు గోపాల్ దంపతులపై దాడికి పాల్పడ్డారు. బాధితుడు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

మహిళను కాపాడిన పోలీసులు



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్ గ్రామ సమీపంలో బ్రిడ్జి పై నుంచి ఎలూరు గ్రామానికి చెందిన ఈర్లపోగుల లక్ష్మి దూకేందుకు యత్నిస్తుండగా ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి, కానిస్టేబుల్ హారికలు గమనించి మహిళను అడ్డుకొని కాపాడారు. అనంతరం పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపట్టారు. భర్త రాజును పిలిపించి ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

మండపంలో అగ్నిప్రమాదం

చారకొండ: మండలంలోని జూపల్లిలో వినాయక చవితి పురస్కరించుకొని గ్రామానికి చెందిన అక్కి శేఖర్ తమ ఇంటి ఎదుట రేకుల పై కప్పు కిందట గణనాథుడిని ప్రతిష్ఠించారు. గురువారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్‌తో వినాయక మండపంలో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

అన్యాయాన్ని ఎదిరించడమే ఎర్రజెండా లక్ష్యం



మాట్లాడుతున్న ఆర్ శ్రీనివాసులు

తెలకపల్లి: అన్యాయాన్ని ఎదిరించడమే ఎర్రజెండా లక్ష్యమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని గడ్డంపల్లిలో సీపీఎం గ్రామసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో దోపిడీ చేసే వర్గాలపై నిరంతరం పోరాడుతామన్నారు. కార్మికుల పక్షాన కమ్యూనిస్టులు నిరంతరం పోరాడాలన్నారు. సాయుధ పోరాటాన్ని వక్రీకరించే కొన్ని రాజకీయ పార్టీలు కుట్ర పన్నుతున్నాయన్నారు. ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో సాయుధ తెలంగాణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గడ్డంపల్లిలో ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిని పంచాలని లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బిచ్చయ్య, మల్లయ్య, గోపస్ లక్ష్మణ్, జగదీశ్, నిరంజన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు.. ప్రాణదాతలు

అచ్చంపేట రూరల్: రక్తదాతలు ప్రాణదాతలు అని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వంశీకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌చౌరస్తాలో కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. రక్తదాతలకు ఎమ్మెల్యే అభినందించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులకు అన్నదానం చేశారు. ఉమామహేశ్వరంలో ఎమ్మెల్యే దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ జన్మదిన వేడుకల సందర్భంగా టీపీసీసీ సభ్యుడు రంగినేని జగదీశ్వరుడు కట్ చేశారు. పేదలకు దుస్తులు, పండ్లు, బ్రెడ్లు అందజేశారు.



అచ్చంపేటలో రక్తదాతకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సీతారాం ఏచూరికి విప్లవ జోహార్లు

నాగర్‌కర్నూల్‌రూరల్: సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అనారోగ్యంతో గురువారం ఢిల్లీలోని ఏయిమ్స్‌లో మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా సీపీఎం నాయకులు స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు మాట్లాడుతూ ఏచూరి మరణం పార్టీకి తీరనిలోటన్నారు. అదేవిధంగా బొందలపల్లి, మంతటి తదితర గ్రామాల్లో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో విప్లవ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, కందికొండ గీత, అశోక్, కాశన్న, రామయ్య, మధు, సత్యనారాయణ, వెంకటేష్, నర్సింహ, లింగం, క్రాంతి, జగదీశ్, ఉప సర్పంచ్ మధు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సీపీఎం నాయకులు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివవర్మ, నాయకులు సలీం, సురేందర్, రాజు తదితరులున్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన ఎంపీడీఓ

ఊర్కొండ: మండలంలోని తిమ్మన్నపల్లి, రేవల్లి గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఎంపీడీఓ కృష్ణయ్య సందర్శించారు. చిన్నారుల ఎత్తులను పరిశీలించి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల రికార్డులను, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరు, భోజనం నాణ్యతను పరిశీలించారు. నర్సరీలో మిగిలిన మొక్కలను నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కార్యదర్శులకు సూచించారు. ఎంపీఓ లక్ష్మణ్ నాయక్, ఏపీఓ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, సరిత పాల్గొన్నారు.

కేవీపీఎస్ నాయకుల నిరసన

నాగర్‌కర్నూల్‌రూరల్: ఇష్టానుసారంగా విధులకు డుమ్మా కొడుతున్న వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆయుర్వేదిక్ డాక్టర్ విధులకు సక్రమంగా రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

నోట్‌బుక్‌ల పంపిణీ

బల్మూర్: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6, 7 తరగతుల విద్యార్థులకు గురువారం నోట్ బుక్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు బలుస శ్రీనువాసులు, మిర్యాల రాము, పోల సాయిరామ్, వినోద్, తిరుపతయ్య, హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): బిజినేపల్లి గ్రామానికి చెందిన మిద్దె మల్లమ్మ మృతిచెందడంతో బాధిత కుటుంబసభ్యులను గురువారం రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. రూ.5000 ఆర్థికసాయం అందజేశారు.

చారకొండ: మండలంలోని గోకారం గ్రామానికి చెందిన బోమ్మలి హనుమంతు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన పగడాల ఆంజనేయులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి హనుమంతు భార్య సాయమ్మకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

కొల్లాపూర్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం కార్మికులు ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడుతూ కార్మికులకు సబ్బులు, నూనెలు, దుస్తులు, పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలన్నారు. అనంతరం కార్యాలయ మేనేజర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం, నాయకులు వెంకటరమణ, ప్రసాద్, రాము, రమణ, రాఘవేంద్ర, రామస్వామి, లక్ష్మి, మున్నయ్య, గోవిందమ్మ, చంద్రకళ, కురుమయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సిద్ధం

వెల్దండ: పకడ్బందీగా ఓటరు జాబితా సిద్ధం చేశామని ఎంపీడీఓ సత్యపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు జాబితా అందుబాటులో ఉంచాలని సూచించారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలల్లో 270 వార్డులు ఉన్నాయని వార్డుల వారిగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీను, సిబ్బంది తదితరులు ఉన్నారు.